పెట్రోల్ బంకులకు నోటీసులు

ప్రజాశక్తి - పోలవరం

పెట్రోలు బంకుల్లో సీసాల్లో, క్యానుల్లో పెట్రోలు పోయకూడదని అధికారులిచ్చిన ఆదేశాల మేరకు ఆదివారం స్థానిక పోలీసులు పోలవరంలో పెట్రోల్ బంకులకు నోటీసులు అందజేశారు. పలుచోట్ల సార్వత్రిక ఎన్నికల్లో హింసలు, కొట్లాటలు చోటుచేసుకున్న నేపథ్యంలో బంకుల నిర్వాహకులు ఈ విషయంపై అప్రమత్తంగా ఉండాలని, అతిక్రమిస్తే బంకులపై చర్యలు తీసుకుంటామని ఎస్ఐ పవన్‌కుమార్ హెచ్చరించారు. పోలవరం పోలీస్‌స్టేషన్ సమీపంలో జైళ్లశాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పెట్రోల్ బంకు, కన్నాపురం అడ్డురోడ్డు వద్ద ఉన్న నయారా పెట్రోలు బంకులకు పోలీస్ సిబ్బంది బాబి నోటీసులు అందజేశారు. పెట్రోల్ బంకుల వద్ద సీసాల్లో, క్యానుల్లో పెట్రోలు ఇవ్వబడదని బహిరంగంగా కనిపించేలా పోస్టర్లు వేయించారు. దీంతో పలువురు బంకుల వద్దకు వచ్చి వెనుదిరిగారు.

కూర 'గాయాలు'..!

భారీగా పెరిగిన కూరగాయల ధరలు

కిలో అల్లం రూ.180 పైనే

కిలో మిర్చి రూ.90కు చేరిక

అదేబాటలో వంగ, బెండ, బీరకాయల ధరలు

వారపు సంతకు రూ.700 వరకూ ఖర్చు

బెంబేలెత్తిపోతున్న జనం

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

కూరగాయల ధరల మంటలు చూసి జనం అదిరిపడుతున్నారు. నిత్యావసర ధరల భారంతో అల్లాడుతున్న జనానికి కూరగాయల ధరల పెరుగుదల హడలెత్తిస్తోంది. వారపు సంత చేయాలంటే రూ.700లకుపైగా ఖర్చుచేయాల్సి రావడంతో జనం తలలు పట్టుకుంటున్నారు. గడిచిన రెండు వారాలుగా కూరగాయల ధరలు భారీగా పెరిగిన పరిస్థితి నెలకొంది. ఆదివారం రైతుబజార్‌లో కూరగాయలు ధరలు చూసి జనం నోరెళ్ల బెడుతున్నారు. ఇక బహిరంగ మార్కెట్లో ధరల పరిస్థితి గురించి వేరే చెప్పనక్కర్లేదు. కిలో మిర్చి ధర రైతుబజార్‌లో రూ.84కు విక్రయిస్తుండగా, ప్రయివేటు మార్కెట్లలో రూ.వంద పలుకుతున్న పరిస్థితి నెలకొంది. కిలో అల్లం రైతు బజార్‌లో రూ.180 ఉండగా బహిరంగ మార్కెట్లో రూ.200ల వరకూ విక్రయిస్తున్నారు. వంకాయలు, బెండకాయలు రైతుబజార్‌లో కిలో రూ.44లకు విక్రయిస్తుండగా, ఇతర మార్కెట్లలో రూ.50పైనే పలుకుతోంది. బీరకాయలు ఏకంగా కిలో రూ.60 వరకూ అమ్ముతున్నారు. చేమ దుంపలు, చిలగడ దుంపులు, క్యాప్సికం వంటి ధరలు సైతం కిలో రూ.50 నుంచి రూ.60లకుపైనే ఉన్నాయి. ఉల్లిపాయలు రూ.30లకు రైతు బజార్‌లో విక్రయిస్తుండగా, బహిరంగ మార్కెట్లో కిలో రూ.35లకుపైగానే అమ్ముతున్నారు. కొత్తిమీర కట్ట రూ.30 ఉంది. దీంతో వారాంతపు సంత ఖర్చు రూ.700లపైగా దాటిపోతోంది. ఇంత ఖర్చుపెట్టినా వారానికి సరిపడా కూరగాయలు కొనుగోలుచేయలేని పరిస్థితి నెలకొంది. దీంతో సామాన్య ప్రజానీకం కడుపు నిండా భోజనం చేయలేని పరిస్థితి ఏర్పడింది. వారంతపు సంతతోపాటు ఆదివారం తెచ్చుకునే మాంసాహారంతో కలుపుకుంటే తక్కువగా లెక్కించినా రూ.900 వరకూ ఖర్చవుతోంది. వాచ్‌మెన్‌లు, ప్రయివేటు కంపెనీల్లో పనిచేసే ఉద్యోగుల్లో అత్యధిక మందికి నెలకు రూ.పది వేల వేతనం అందుకోవడమే గగనంగా మారింది. ఇటువంటి పరిస్థితుల్లో వారపు సంతకు రూ.900కుపైగా ఖర్చుపెడితే నెలకు దాదాపు రూ.నాలుగు వేలకు పైగా అవుతోంది. వస్తున్న రూ.పది వేల జీతంలో కూరగాయల ఖర్చులకే రూ.నాలుగు వేలు అయిపోతే ఇక ఇంటి అద్దె, కరెంటు బిల్లు, వంట గ్యాస్‌కు, కేబుల్, ఆరోగ్య ఖర్చులకు సంబంధించి ఎలా సర్దుబాటు చేసుకోవాలో అర్ధంకాని పరిస్థితి నెలకొంది. ఇప్పటికే మోడీ అధికారం చేపట్టాక పెట్రోల్ ధర లీటర్ రూ.110 దాటేసింది. డీజిల్ ధర లీటర్ రూ.వంద పలుకుతోంది. వంటగ్యాస్ సిలిండర్ రూ.850 వరకూ ఉంది. కందిపప్పు, మినపప్పు, పెసరపప్పు వంటి పప్పుల ధరలు కిలో రూ.130లకుపైనే ఉన్నాయి. ఇంటి అద్దెలు 200 శాతం పెరిగాయి. పిల్లల ఫీజులు అదేస్థాయిలో పెరిగిన పరిస్థితి నెలకొంది. అయితే వేతనాలు మాత్రం పెరగలేదు. దీంతో మధ్యతరగతి, సామాన్య ప్రజానీకానికి ధరల పెరుగుదల పెనుభారంగా మారింది. ఇప్పుడు కూరగాయల ధరలు సైతం ఆకాశాన్ని తాకడంతో జనం అల్లాడిపోతున్న పరిస్థితి నెలకొంది. పెరిగిన కూరగాయల ధరలకు సంబంధించి రైతుబజార్లలో సబ్సిడీకి ఇచ్చేవిధంగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటే జనానికి మేలు జరిగే పరిస్థితి ఉంటుంది. లేకపోతే సామాన్య ప్రజానీకం కడుపునిండా తినలేని పరిస్థితి కొనసాగుతోంది.

ఏలూరు రైతుబజార్‌లో ఆదివారం పలు కూరగాయల ధరలు ఇలా..

కూరగాయలు	ధర కిలో రూ.
మిర్చి	84
అల్లం	180
బీర	58
ఉల్లి	30
బెండ	44
వంకాయలు	44
టమాట	28
కొత్తిమీర కట్ట	30
చేమదుంపలు	54
కీరదోస	40
కాప్సికం	68
చిలకడ దుంప	40
క్యారెట్	38
దొండ	36
బీట్ రూట్	36
గోరుచిక్కుడు	58

బహిరంగ మార్కెట్లో రైతుబజార్ కంటే కిలోకు రూ.ఐదుపైనే అదనంగా విక్రయిస్తున్న పరిస్థితి.

వైట్‌గట్‌తో.. రొయ్య రైతు విలవిల..!

ప్రజాశక్తి - కాళ్ల

వాతావరణంలో మార్పులతో రొయ్యల చెరువుల్లో వైట్‌గట్ వైరస్ వ్యాధి సోకి రొయ్యలు చచ్చిపోతున్నాయి. నిజానికి వేసవి వనామీకి మంచి సీజన్. అయితే వైట్‌గట్ వైరస్ సోకడంతో ఉప్పుటేరు తీర ప్రాంతమైన కాళ్ల మండలంలో ఆక్వా చెరువుల్లో ఎక్కడ చూసినా మృత్యువాత పడిన రొయ్యలే కన్పిస్తున్నాయి. లాభాల పంటగా గుర్తింపు పొందిన వనామీ రొయ్యల సాగుకు వైట్‌గట్ రైతులను అప్పుల ఊబిలోకి నెట్టేసింది.

మండలంలో పలు గ్రామాల్లో రొయ్యల చెరువుల్లో వైట్‌గట్ వ్యాధి సోకి రొయ్యలు మృత్యువాత పడుతుండడంతో చెరువులను ఖాళీ చేయక తప్పని పరిస్థితి నెలకొంది. ఇది చాలదన్నట్లు వాతావరణ మార్పులతో చేతికందొచ్చిన పంట దక్కుతుందో లేదోనని ఆక్వా సాగుదారులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు.

రంగుమారిన వనామి..

20 వేల ఎకరాల్లో ఆక్వా సాగవుతోంది. 13 వేల ఎకరాల్లో రొయ్యల సాగు చేస్తున్నారు. మండలంలో సుమారు 80 ఎకరాల్లోని వైరస్ సోకిన రొయ్యలు చనిపోతున్నాయి. దీంతో కాళ్ల, కాళ్లకూరు, సీసలి, దొడ్డనపూడి, జువ్వలపాలెం, ప్రాతాళ్లమెరక, కలవపూడి గ్రామాల్లో హడావుడీగా పట్టుబడి చేస్తున్నారు. రొయ్యలు కూడా చనిపోతుండడంతో పెట్టుబడులు కూడా రావడం లేదని వాపోతున్నారు. మొన్నటి 60 కౌంట్ రొయ్యల ధర రూ.320 ఉండేది. ప్రస్తుతం రూ.270 ఉంది. చనిపోయిన రొయ్యలు ఎరుపురంగులోకి మారడంతో వ్యాపారులు కొనుగోలు చేయకపోవడంతో గోతుల్లో వేసి పూడ్చుతున్నారు. ముమ్మరంగా రొయ్యల పట్టుబడులు చేయడంతో వ్యాపారులు సిండికేట్‌గా ఏర్పడి తక్కువ ధరకు కొనుగోలు చేస్తున్నారు.

రొయ్య సీడ్‌లో లోపమో, చెరువుల్లో ఉన్న నీటిలో లోపమో, వేసే మేతలో లోపమో తెలియదుగానీ రొయ్య సీడ్ చెరువులో వేసిన నెల రోజులకే మృత్యువాత పడుతోంది. దీంతో ఆక్వా రైతులు దిక్కుతోచని స్థితిలో కొట్టుమిట్టాడుతున్నారు. విదేశాల నుంచి వ్యాధి నిరోధకత కలిగిన తల్లి రొయ్యలను దిగుమతి చేసుకుని, అన్ని పరీక్షలూ నిర్వహించి హేచరీల ద్వారా రొయ్య సీడ్ ఉత్పత్తి చేస్తున్నారు.

ఇన్ని జాగ్రత్తలు తీసుకున్న ఇటీవల కాలంలో సీడ్ వేసిన నెల రోజుల్లోపునే వైట్‌గట్ వైరస్ వ్యాధి సోకి రొయ్యలు చనిపోతున్నాయి. నిజానికి వేసవి వనామీకి మంచి సీజన్ అలాంటిది. వైట్‌గట్ వైరస్ సోకడంతో పలు గ్రామాల్లో చెరువుల్లో ఎక్కడ చూసినా మృత్యువాత పడిన రొయ్యలే కన్పిస్తున్నాయి. దీంతో పలు గ్రామాల్లో హడావుడీగా రొయ్యలు పట్టుబడి చేస్తున్నారు. దీంతో రొయ్యల రైతులు సుమారు రూ.లక్షల్లో మేర నష్టపోయారు.

వైరస్ సోకి చనిపోతున్న రొయ్యలు

వైట్‌గట్ వైరస్ వ్యాధి సోకడంతో రంగు మారిన రొయ్యలు

రొయ్యలు పట్టుబడి పట్టి వ్యాన్‌లోకి ఎగుమతి చేస్తున్న రైతులు

విద్యుత్ బిల్లులకే సరిపోతుంది..

దండు ప్రణవమూర్తిరాజు, ఆక్వా రైతు కాళ్లకూరు

వైరస్ సోకిన రొయ్యలు చనిపోయి నీటిపై తేలుతున్నాయి. పట్టుబడులు నిర్వహించిన రొయ్యలకు అంతగా ధర కూడా పలకడం లేదు. రొయ్యలు 60 కౌంట్ రూ.270కు అమ్ముకుంటున్నాం. విద్యుత్ బిల్లులకే ఆ సొమ్ము సరిపోతుంది. ఆక్వా రైతులు నష్టాల ఊబిలో ఉన్నారు.

నీటి నాణ్యత పాటించాలి..

ఇందిరా ప్రియదర్శిని, ఎఫ్‌డిఒ, కాళ్ల

వాతావరణంలో చోటుచేసుకున్న మార్పులకు తోడు నాణ్యమైన సీడ్ కొరతతో ఆక్వారంగం అల్లాడిపోతోంది. చెరువులో నిలకడగా ఉండాల్సిన ఉష్ణోగ్రతల్లో వ్యత్యాసాలు రావడంతో పిహెచ్ పడిపోయి వనామి రొయ్యలకు వైట్‌గట్ సోకి మృత్యువాత పడుతున్నాయి. చెరువులో రొయ్యలు వ్యాధులు బారిన పడకుండా ఉండాలంటే నీటి నాణ్యత పాటించాలి. అలాగే రొయ్య సీడ్‌కు పిసిఆర్ పరీక్షలు చేసిన తర్వాతే చెరువుల్లో వేయాలి.

సుందరయ్య వర్ధంతి సందర్భంగా ..

సిపిఎం నాయకుల అవయవదానం

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

ఆదర్శనేత పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతి సందర్భంగా ఏలూరు ప్రభుత్వ మెడికల్ కాలేజీకి సిపిఎం నాయకులు మరణానంతరం తమ శరీరాలను దానం చేశారు. ఆదివారం ఉదయం ఏలూరు సిపిఎం పార్టీ కార్యాలయం వద్ద సుందరయ్య వర్ధంతి సభ ఆ పార్టీ నగర కార్యదర్శి పి.కిషోర్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి మాట్లాడుతూ దేశంలో పీడిత ప్రజల విముక్తి కోసం తన జీవితాన్ని అంకితం చేశారన్నారు. కమ్యూనిస్టు పార్టీల నాయకులే కాకుండా బూర్జువా పార్టీల నాయకులు సైతం సుందరయ్య అంటే ఆయన సిద్ధాంత అధ్యయనానికి నిరాడంబరతకు ఎనలేని గౌరవం ఇచ్చే వారిని గుర్తు చేశారు. ఎటువంటి మచ్చలేని ఆదర్శనేత సుందరయ్య అని కొనియాడారు. ఉన్నత కుటుంబంలో పుట్టిన సుందరయ్య చిన్నతనంలోనే తన ఇంట్లో పనిచేస్తున్న పాలేరు కుమారుడు తనతో పాటు కలిసి భోజనం చేసే విధంగా ఇంటి నుంచే తన వర్గ పోరాటాన్ని ప్రారంభించిన మహానేత అన్నారు. అటువంటి సుందరయ్య ఆశయాలు సిపిఎం ముందుకు తీసుకెళ్తోందన్నారు. దానిలో భాగంగానే ఏటా సుందరయ్య వర్ధంతి సందర్భంగా అనేక సేవా కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. దానిలో భాగంగా ఈ వర్ధంతికి సిపిఎం ఏలూరు జిల్లాలో పలువురు సిపిఎం నాయకులు, వారి పిల్లలు తమ మరణాంతరం శరీర దానం చేయడం జరుగుతోందన్నారు. ఏలూరు ప్రభుత్వ మెడికల్ కాలేజీ అనాటమీ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ భరత్ మాట్లాడుతూ మనిషి చనిపోయిన తర్వాత కూడా సమాజ సేవకు ఉపయోగపడాలని భావించే కమ్యూనిస్టు పార్టీ కార్యకర్తలను అభినందించారు. సుందరయ్య వంటి నేతల వర్ధంతిని దానికి ఎంచుకోవాడాన్ని ప్రశంసించారు. ప్రభుత్వ మెడికల్ కాలేజీకి సిపిఎం నాయకులు మరణాంతరం తమ శరీరాలను దానం చేయడం సంతోషదాయకమన్నారు. ఈ సందర్భంగా సిపిఎం ఏలూరు కార్యదర్శి పి.కిషోర్, ఆయన సతీమణి, మహిళా నాయకురాలు సిహెచ్.రాజ్యలక్ష్మి, ఎ.శరత్‌చంద్ర, సిపిఎం నూజివీడు రూరల్ మండలం కార్యదర్శి నిమ్మగడ్డ నరసింహ, ఆయన సతీమణి, మహిళా నాయకురాలు శశికళ, సిపిఎం కలిదిండి మండల కార్యదర్శి శేషపు మహంకాళి, ఆయన సతీమణి, మహిళా నాయకురాలు మహాలక్ష్మి తదితరులు తమ శరీరాలను మరణాంతరం ప్రభుత్వ మెడికల్ కాలేజీకి అందిస్తున్నట్లు స్టాంప్ పేపర్, నోటరీ డాక్యుమెంట్లను డాక్టర్ భరత్‌కు అందజేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు బి.సోమయ్య, ఎం.మంగరాజు, మహిళా నాయకులు ఎ.శ్యామలరాణి, కొరి విజయలక్ష్మి చింతాడ వెంకటలక్ష్మి పాల్గొన్నారు.

స్టాంప్ పేపర్, నోటరీ డాక్యుమెంట్లను డాక్టర్ భరత్‌కు సిపిఎం నేతలు

సుందరయ్య ఆశయాలను ముందుకు తీసుకెళ్లాలి

వర్ధంతి సభల్లో నేతలు

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

దక్షిణ భారత దేశ కమ్యూనిస్టు పార్టీ ఉద్యమ నిర్మాత పుచ్చలపల్లి సుందరయ్య ఆశయాలు ముందుకు తీసుకెళ్లడమే ఆయనకు ఇచ్చే నివాళి అని సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి అన్నారు. సిపిఎం కార్యాలయం వద్ద సుందరయ్య వర్ధంతి సభ ఆ పార్టీ నగర కార్యదర్శి పి.కిషోర్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా రవి మాట్లాడుతూ దేశంలో పీడిత ప్రజల విముక్తి కోసం సుందరయ్య తన జీవితాన్ని అంకితం చేశారన్నారు. ప్రజలకు సేవ చేయడానికి కుటుంబం ఉంటే ఆటంకం కలిగిస్తుందని కుటుంబ నియంత్రణ చేసుకొని వివాహం చేసుకున్నారని, ప్రజలనే తన పిల్లలుగా భావించారని తెలిపారు. ప్రజలను భాగస్వామ్యం చేసి కష్ణ జిల్లా బందరు కాలువ తవ్వడం ద్వారా వ్యవసాయానికి నీళ్లు అందించారని అన్నారు. రాష్ట్ర సమగ్ర అభివృద్ధి కోసం విశాలాంధ్రలో ప్రజారాజ్యం అనే ఒకపుస్తకం రాశారన్నారు. ఆ పుస్తకం ఆధారంగానే తరువాత ప్రభుత్వాలు రాష్ట్రంలో అనేక ప్రాజెక్టు నిర్మాణాలకు పూనుకున్నాయన్నారు. నేడు పోలవరం ప్రాజెక్టు ప్రాధాన్యత ఆనాడే సుందరయ్య గుర్తించి చెప్పారన్నారు. అటువంటి ఆదర్శ నేత సుందరయ్య ఆశయాలు సిపిఎం ముందుకు తీసుకెళ్తుందన్నారు. దానిలో భాగంగానే ప్రతి ఏటా సుందరయ్య వర్ధంతి సందర్భంగా రక్తదానం, మజ్జిగ చలివేంద్రాలు వంటి అనేక సేవా కార్యక్రమాలు జరుగుతాయన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు డిఎన్‌విడి.ప్రసాద్, జిల్లా కమిటీ సభ్యులు బి.సోమయ్య, ఎం.మంగరాజు, పార్టీ సీనియర్ నాయకులు పి.ఆదిశేషు, మహిళా నాయకులు ఎ.శ్యామలారాణి, కొర్రి విజయలక్ష్మి, చింతాడ వెంకటలక్ష్మి, నగర నాయకులు వి.సాయిబాబు, బి.జగన్నాథరావు, కె.రామాంజనేయులు, వివివిఎన్.ప్రసాద్, జి.రవికిషోర్, వైఎస్.కనకరావు పాల్గొన్నారు.

జీలుగుమిల్లి : మండలంలోని అంకన్నగూడెం గ్రామంలో వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. సుందరయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి మాట్లాడుతూ కమ్యూనిస్టు పార్టీని స్థాపించి పార్టీ కోసం అహర్నిశలు కృషి చేసిన మహనీయుడు పుచ్చలపల్లి సుందరయ్య అని, బడుగు బలహీన తరగతుల ప్రజలకు ఎనలేని కృషి చేశారని ఆయన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి తెల్లం దుర్గారావు, తెల్లం రామకృష్ణ, నాయకులు జి. వెంకట్రావు, శిరిబత్తుల సీతారామయ్య, కొం డలరావు, దానియేలు, నాగదుర్గ, గంగరాజు పాల్గొన్నారు.

చింతలపూడి : చింతలపూడిలో సిఐటియు ఆధ్వర్యంలో సుందరయ్య వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి డిఎన్‌విడి.ప్రసాద్ మాట్లాడుతూ పుచ్చలపల్లి సుందరయ్య కార్మిక పక్షపాతి అని కార్మిక రాజ్య స్థాపనకు అహర్నిశలు కృషి చేసిన వ్యక్తి అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఎస్.సూర్యకుమార్, జోషి, కె.వాసు, డి.సత్యనారాయణ పాల్గొన్నారు.

ముసునూరు : సిపిఎం నాయకులకు ఆదర్శమూర్తి పుచ్చలపల్లి సుందరయ్య అని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జి.రాజు అన్నారు. మండలంలోని పలు గ్రామాల్లో పుచ్చలపల్లి సుందరయ్య 39వ వర్ధంతి కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. మం డలంలోని ముసు నూరు, చింత లవల్లి, వలసపల్లి, చెక్కపల్లి, కాట్రేనిపాడు, గోప వరం గ్రామాల్లో పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతి కార్యక్రమాన్ని సిపిఎం మండల కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు జి.రాజు మాట్లాడుతూ సుందరయ్య చేసిన త్యాగాలు, సుందరయ్య చేసిన పోరాటాలను వివరించారు. ఆయన ఆశయాలను సిపిఎం సభ్యులందరూ పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు కంచర్ల శ్రీను, కంచర్ల శివప్రసాద్, కంచర్ల కుటుంబరావు, కంచర్ల దుర్గారావు, కంచర్ల శ్రీనివాస్, కంచర్ల వంశీ, అనిగాని వెంకటేశ్వరరావు, చింతా ఏడుకొండలు పాల్గొన్నారు.

భీమడోలు : పీడిత ప్రజల ప్రియతమ నేత పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతి కార్యక్రమాన్ని భీమడోలు సిపిఎం కార్యాలయంలో ఆదివారం నిర్వహించారు. తొలుత సిపిఎం జిల్లా నాయకులు ఆర్.లింగరాజు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల కోసం, దేశ, రాష్ట్రాల అభివృద్ధి కోసం కమ్యూనిస్టులు అంకితభావంతో పని చేస్తారనే సత్యాన్ని సుందరయ్య జీవిత చరిత్ర తెలియజేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు కట్టా భాస్కరరావు, జి.ప్రసాదరావు, వెజ్జు శ్రీరామచంద్రమూర్తి, కేతా నాగయ్య పాల్గొన్నారు.

కొయ్యలగూడెం : కొయ్యలగూడెం మండల ప్రాథమిక పాఠశాలలో సుందరయ్య వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు నాగమణి, సిపిఎం మండల కార్యదర్శి శుక్ల బోయిన రాంబాబు మాట్లాడుతూ సుందరయ్య రాసిన విశాలాంధ్రలో ప్రజారాజ్యం గ్రంథం తెలుగు ప్రజల హృదయ స్పందనగా మారిందన్నారు. దేశంలో అనేక సంస్కరణలు తెచ్చిన వ్యక్తిగా ఆయన, బడుగు బలహీన వర్గాల్లో చీర స్థాయిగా నిలిచిపోతారన్నారు. ఈ కార్యక్రమంలో యు.నాగమణి, సిహెచ్.మరీడయ్య, బొబ్బరా మంగరాజు, శివకుమార్, శివ రత్నకుమారి, సునీత రాయల్, గోపీ, వెంకన్న, నాగమణి పాల్గొన్నారు.

నిడమర్రు : స్థానిక ప్రజాసంఘాల కార్యాలయంలో సిఐటియు, సిపిఎం కమిటీల ఆధ్వర్యంలో సుందరయ్య వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సుందరయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. నిడమర్రు, భువనపల్లి, పత్తేపురం గ్రామాల్లో వర్ధంతి సభలు నిర్వహించారు. సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు జివిఎల్.నరసింహరావు మాట్లాడారు. పేద ప్రజలు అభ్యున్నతి సంక్షేమం కోసం, సోషలిజం సమ సమాజ స్థాపన కోసం, కుల మతాలు అంతరాలు లేని దేశం కోసం నిరంతరం పోరాడిన ఆయన ఆశయాలను కొనసాగించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నారపల్లి రమణారావు, సిహెచ్.వరలక్ష్మి, కోన శ్రీనివాసరావు, గవర సత్యనారాయణ, వెలగలేటి కంత వరప్రసాద్, లావేటి చంద్రరావు, కానూరు రాజు, లావేటి సోంబాబు పాల్గొన్నారు.

ఏలూరు అర్బన్ : మాట్లాడుతున్న ఎ.రవి



చింతలపూడి : నివాళులర్పిస్తున్న నేతలు



కొయ్యలగూడెం : నివాళులర్పిస్తున్న నేతలు

నిడమర్రు : నివాళులర్పిస్తున్న నేతలు

భీమడోలు : నివాళులర్పిస్తున్న నేతలు



పెదపాడు : నివాళులర్పిస్తున్న నేతలు

ఉద్యోగులు అలసత్వం వహించొద్దు

జిల్లా ఎస్‌పి మేరీ ప్రశాంతి

ప్రజాశక్తి - ఏలూరు

సార్వత్రికల ఎన్నికల అనంతరం ఏలూరు సిఆర్ఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో ఎంపీ, అసెంబ్లీ నియోజకవర్గాలకు చెందిన ఇవిఎం ప్యాడ్ బాక్స్‌లను భద్రపర్చారు. ఈ మేరకు ఆదివారం జిల్లా ఎస్‌పి మేరీ ప్రశాంతి ఇవిఎం స్ట్రాంగ్ రూమ్ వద్ద భద్రతను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఇవిఎం స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద భద్రతను నిర్వహిస్తున్న ఉద్యోగులకు ఉద్యోగ నిర్వహణలో అలసత్వం వహించకుండా అప్రమత్తతో ఉండాలన్నారు. అలాగే స్ట్రాంగ్ రూముల వద్ద ఏర్పాటు చేసిన సిసి కెమెరాల పనితీరు గురించి అధికారులకు తగు సూచనలు, ఆదేశాలిచ్చారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్‌పి మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా 144 సెక్షన్ అమల్లో ఉందని, అనుమానాస్పద వాహనాలు నిత్యం తనిఖీలు నిర్వహిస్తున్నామని, ప్రశాంతమైన గ్రామాల్లో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అన్ని పోలీస్‌స్టేషన్ల పరిధిలో కార్డెన్ సెర్చ్ నిర్వహిస్తున్నామని తెలిపారు. ఎస్‌పి వెంట ఎఆర్ అదనపు ఎస్‌పి ఎన్ఎస్ఎస్.శేఖర్, ఎఆర్ డిఎస్‌పి హరిరావు, ఎస్‌బి ఇన్‌స్పెక్టర్ మల్లేశ్వరరావు, పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

స్ట్రాంగ్ రూమ్ వద్ద జిల్లా ఎస్‌పి మేరీ ప్రశాంతి

ఓట్ల లెక్కింపు ప్రక్రియకు ప్రణాళిక

కలెక్టర్ ప్రసన్నవెంకటేష్

ప్రజాశక్తి - ఏలూరు

ఓట్ల లెక్కింపు ప్రక్రియకు ప్రశాంత వాతావరణంలో ప్రణాళిక రూపొందించుకున్నామని కలెక్టర్ ప్రసన్నవెంకటేష్ కేంద్ర ఎన్నికల కమిషన్ ప్రిన్సిపల్ కార్యదర్శి జోషికి వివరించారు. ఓట్ల లెక్కింపు ప్రక్రియపై ఢిల్లీ నుంచికేంద్ర ఎన్నికల కమిషన్ ప్రిన్సిపల్ కార్యదర్శి జోషి ఆదివారం పోలింగ్ పూర్తయిన రాష్ట్రాలకు చెందిన జిల్లా ఎన్నికల అధికారులు, రిటర్నింగ్ అధికారులకు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పలు సూచనలు జారీ చేశారు. ఈ సందర్భంగా ఏలూరు కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుంచి పాల్గొన్న కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ జిల్లాలో ఓట్ల లెక్కింపు ప్రక్రియపై చేపట్టిన చర్యలను తెలియజేశారు.

నేటి నుంచి కర్రసాములో శిక్షణ

ప్రజాశక్తి - ఏలూరు

ఎవిఆర్ విజ్ఞాన కేంద్రం, హేలాపురి బాలోత్సవం, హేలాపురి చిల్డ్రన్స్ క్లబ్‌ల ద్వారా ఈ నెల 20వ తేదీ నుంచి ప్రతిరోజు సాయంత్రం ఐదు గంటల నుంచి ఎఆర్‌డిజికె హైస్కూల్‌లో కర్రసాము ఉచిత వేసవి శిక్షణ శిబిరం నిర్వహించనున్నట్లు హేలాపురి బాలోత్సవం అధ్యక్షులు ఆలపాటి నాగేశ్వరరావు తెలిపారు. ఆదివారం నిర్వహించిన మానవతా వార్షిక సమావేశం సందర్భంగా కర్ర సాము శిక్షణ శిబిరం ఫ్లెక్సీలను, ప్రచార కరపత్రాలను నాగేశ్వరరావు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కర్రసాము మాస్టర్స్ జోగా చంద్రశేఖర్, జోగా మోహన్‌రావులు శిక్షణ ఇస్తారని చెప్పారు. 20వ తేదీ సాయంత్రం ఐదు గంటలకు హై స్కూల్‌లో వివిధ సంఘాల పెద్దలు పాల్గొని కర్ర సాము శిక్షణ శిబిరాన్ని ప్రారంభిస్తారని తెలిపారు. ఆసక్తి గలవారు నేర్చుకోవడానికి ఏర్పాటు చేసిన ఉచిత శిక్షణ శిబిరాన్ని వినియోగించుకోవాలని కోరారు. మరిన్ని వివరాలకు కె.శ్రీనివాసరావు 9346936521 సంప్రదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎవిఆర్ విజ్ఞాన కేంద్రం, హేలాపురి బాలోత్సవం, మానవతా ఏలూరు కమిటీ సభ్యులు అడుసుమిల్లి నిర్మల, పీడీ రత్నాకరరావు, దేవినేని భాస్కరరావు, ఎస్.కస్తూరిరావు, శ్రీహరికోటి, మేతరజ బాబు, కె.కనకదుర్గ, ఎ.మోహిని, సోమ్లా నాయక్, నాగేశ్వరరావు, సత్యవాణి, కోహిమా పాల్గొన్నారు.



ఫ్లెక్సీ ఆవిష్కరిస్తున్న ఆలపాటి నాగేశ్వరరావు

వేసవి విజ్ఞాన శిక్షణ శిబిరం ప్రారంభం

ప్రజాశక్తి - ఏలూరు

శిబిరంలో విద్యార్థులు

ఏలూరు జిల్లా కేంద్ర గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిక్షణ శిబిరం (సమ్మర్ క్యాంపు) ఆదివారం ప్రారంభమైంది. ఈ సందర్భంగా వివిధ పాఠశాలల విద్యార్థులకు మంచి నీతి కథలు, దేశభక్తి కథలు, ఫ్రీడమ్ ఫైటర్స్ జీవిత చరిత్రలు చెప్పారు. మ్యూజిక్ టీచర్ (రిసోర్సెస్ పర్సన్) వి.నళిని విద్యార్థులకు దేశ భక్తి గీతాలపై (సింగింగ్) సారే జహాసే అచ్చా గీతంపై శిక్షణ ఇచ్చారు. రిసోర్సెస్ పర్సన్ డి.శ్రీవల్లి వెస్ట్ ఫ్రమ్ ది బెస్ట్ అని ప్లాస్టిక్ బాటిల్స్‌తో డెకరేట్ ఐటమ్స్ తయారు చేయడంపై శిక్షణ ఇచ్చారు. హేలాపురి చిల్డ్రన్స్ క్లబ్ ఆధ్వర్యంలో బి.దుర్గాప్రసాద్, టీమ్ విద్యార్థులందరికీ మైండ్ పవర్ గేమ్స్, మెమరీ గేమ్స్ నేర్పించారు. ఈ శిక్షణా కార్యక్రమాలను డిప్యూటీ లైబ్రేరియన్ ఎ.నారాయణరావు పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో విటి.సందీప్‌కుమార్, ఎండి ఎ.అస్లామ్ పాషా పాల్గొన్నారు.

స్ట్రాంగ్ రూమ్‌ల పరిశీలన

ప్రజాశక్తి - ఏలూరు

పోలవరం నియోజకవర్గ ఇవిఎంలు భద్రపరిచిన స్ట్రాంగ్‌రూమ్‌ల వద్ద భద్రతను ఐటిడిఎ పిఒ, పోలవరం నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి సూర్యతేజ ఆదివారం పరిశీలించారు. ఏలూరులోని సర్‌సిఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో ఏర్పాటు చేసిన ఇవిఎంల స్ట్రాంగ్‌రూమ్‌ను అధికారులతో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా సూర్యతేజ మాట్లాడుతూ ఇవిఎంల భద్రతలో అనుక్షణం అప్రమత్తంగా ఉండాలన్నారు. ఇవిఎంలకు ప్రభుత్వం మూడు అంచెల భద్రత కల్పించిందన్నారు. తలుపులకు వేసిన తాళాలను, తాళాలకున్న సీళ్లను క్షుణ్ణంగా పరిశీలించారు. అన్ని చోట్లా సీసీ కెమెరాలు పరిశీలన చేశారు. తనిఖీ అనంతరం సందర్శకుల రిజిష్టర్‌లో సంతకం చేశారు. మూడంచెలు గల కేంద్ర పోలీసు బలగాల గార్డును, జిల్లా ఆర్మ్డ్ పోలీసు గార్డు, సివిల్ పోలీసు బందోబస్తులను పిఒ పరిశీలించారు. ఇక్కడి పరిస్థితులను నిరంతరం పర్యవేక్షించాలన్నారు. అనధికార వ్యక్తులను స్ట్రాంగ్ రూంలు ఉన్న ప్రాంతంలోకి ఎట్టిపరిస్థితుల్లోనూ అనుమతించరాదన్నారు. ఎలక్షన్ కమిషన్ నిబంధనల ప్రకారం అన్ని విధాలుగా జాగ్రత్తలు వహించాలన్నారు. ఆయనతో పాటు పోలవరం నియోజకవర్గ రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

ఏలూరులో కే క్యూ బ్యూటీ స్టూడియో ప్రారంభం

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

చర్మ సౌందర్యం కోసం విజయవాడ, హైదరాబాద్ వంటి నగరాలకు ఇకనుంచి వెళ్లాల్సిన అవసరం లేదని ప్రముఖ వ్యాపారవేత్త మడుపల్లి రత్నాకర్ అన్నారు. బ్యూటీషియన్ రంగంలో 25 సంవత్సరాల అనుభవం కలిగిన చెల్లూరి రుద్రరాజా ఏలూరు నగరంలోని పత్తేబాద స్వీట్ మ్యాజిక్ ఎదురుగా నూతనంగా ఏర్పాటు చేసిన కే క్యూ బ్యూటీ స్టూడియోను ఆదివారం రత్నాకర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వహించిన విలేకర్ల సమావేశంలో రత్నాకర్ మాట్లాడుతూ స్త్రీ, పురుషులందరికీ అందుబాటులో ఉండే విధంగా కే క్యూ బ్యూటీ స్టూడియోను ఏర్పాటు చేశారని, సౌందర్యాభిమానులందరూ సందర్శించి సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ స్టూడియో ఏలూరు నగరానికే మణిహారంలా నిలుస్తుందన్నారు. స్టూడియో అధినేత చెల్లూరి రుద్రరాజా మాట్లాడుతూ 1996 నుంచి బ్యూటీషియన్ ఇండస్ట్రీలో ఉన్నానని, 2000 సంవత్సరంలో ఆర్ఆర్ పేటలో షాపు ఏర్పాటు చేశానని చెప్పారు. ఇప్పుడు పత్తేబాదలో అద్భుతమైన బ్యూటీ స్టూడియోను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. స్కిన్, హెయిర్ సంబంధిత డాక్టర్ల పర్యవేక్షణలో ఆధునిక లేజర్ ఎక్యుప్‌మెంట్‌తో వినియోగదారులు మెచ్చే విధంగా అందంగా తయారు చేస్తామన్నారు. హైదరాబాద్, విజయవాడ వెళ్లేవారిని హ్యాక్ చేద్దామనే ఉద్దేశంతో స్టూడియోను ఏర్పాటు చేశామని, అన్ని హంగులు అందుబాటులో ఉంచామన్నారు. ఆదరించి, ఆశీర్వదించాలని ఏలూరు నగర ప్రజలకు ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో చెల్లూరి సత్యనారాయణ, పచ్చా గోపాలకృష్ణ పాల్గొన్నారు.

పలుచోట్ల క్యాండిల్ లైటింగ్ డే

ప్రజాశక్తి -ముదినేపల్లి

మండలంలోని సింగరాయపాలెంలో ఆదివారం క్యాండిల్ లైటింగ్ డే కార్యక్రమం నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎయిడ్స్ కంట్రోల్ సంస్థ చైల్డ్ ఫండ్ ఇండియా ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు కొవ్వొత్తులతో గ్రామంలో ప్రదర్శన చేశారు. హెచ్ఐవి తో మరణించిన వారందరికీ ప్రతి ఏటా మే మూడో తేదీన నివాళులర్పించడంతోపాటు వారి ఆత్మకు శాంతి చేకూరాలని కొవ్వొత్తుల ప్రదర్శన చేస్తున్నట్లు సంస్థ ప్రతినిధులు తెలిపారు. ఈ కార్యక్రమంలో సిహెచ్.నాగలక్ష్మి, చంద్రలీలా, సౌజన్య, కాంతమ్మ ఎఎన్ఎంలు, ఆశావర్కర్లు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

భీమడోలు : హెచ్ఐవి, ఎయిడ్స్‌తో చనిపోయిన వారిని గుర్తు చేసుకుంటూ, వారికి ప్రేమ, సంఘీభావం తెలియజేయడం, వారి కుటుంబ సభ్యుల బాధను నయం చేయడం లక్ష్యంగా భీమడోలు సామాజిక ఆరోగ్య కేంద్రం వద్ద ఐసిటిసి అధికారులు క్యాండిల్ లైట్ ప్రదర్శనను నిర్వహించారు. అంతర్జాతీయ దీప స్మృత్యాంజలి దినం పురస్కరించుకుని ఆదివారం రాత్రి సామాజిక ఆరోగ్య కేంద్రం వైద్యులు ఎం.సతీష్‌కుమార్, ఐసిటిసి కౌన్సిలర్ సిహెచ్.సింహాద్రి, పాపారావు ఆధ్వర్యంలో ఆరోగ్య కేంద్రం వద్ద ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. ఎయిడ్స్‌తో చనిపోయిన వారిని గుర్తు చేసుకుంటూ తిరిగి మరొకరికి ఆ పరిస్థితులు రాకుండా చూసేందుకు అవగాహన సదస్సును నిర్వహించారు. కొవ్వొత్తులతో ఆరోగ్య కేంద్రం ఆవరణలో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య కేంద్రం అధికారులు పి.విక్టరీ, అనిల్ ఇతర సిబ్బంది అధిక సంఖ్యలో వైద్యశాలలో చికిత్స పొందుతున్న రోగులు, వారి సహాయకులు పాల్గొన్నారు.

ఆర్ఎంపి, పిఎంపిలకు వైద్య పరీక్షలు

ప్రజాశక్తి - బుట్టాయగూడెం

రాజమండ్రి పల్స్ హాస్పిటల్ ఆధ్వర్యంలో గ్రామీణ వైద్యుల ఐక్య వేదిక బుట్టాయగూడెం మండలంలోని ఆర్ఎంపి, పిఎంపిలకు రక్త పరీక్షలు, గుండెకు సంబంధించిన ఇసిజి 2డి ఎకో పరీక్షలు ఉచితంగా చేసి కార్డియాలజీ వైద్యులు కొల్లూరి లక్ష్మణ్ స్వయంగా పరీక్షించారు. పల్స్ హాస్పిటల్ గుండె సంబంధిత వైద్యులు కొల్లూరి లక్ష్మణ్ మాట్లాడుతూ ఏజెన్సీ గ్రామీణ ప్రాంతం ప్రజలకు గ్రామీణ వైద్యుల సేవలు ఎంతగానో ఉపయోగపడుతున్నాయన్నారు. గుండె సంబంధిత వ్యాధులకు సంబంధించి తీసుకోవాల్సిన జాగ్రత్తలను, గుండె నొప్పి, గ్యాస్ నొప్పికి మధ్య తేడాలను ఎలా గుర్తించాలో వివరించారు. ఈ కార్యక్రమంలో గ్రామీణ వైద్యుల వేదిక అధ్యక్షులు ఎన్‌వి.సత్యనారాయణ, గౌరవ అధ్యక్షులు సుందరం, ఉపాధ్యక్షులు సత్యనారాయణ, కార్యదర్శి వీర్రాజు, ట్రెజరర్ త్రినాథ్, బుట్టాయగూడెం మండలంలోని ఆర్ఎంపిలు, పిఎంపిలు పాల్గొన్నారు.

మాజీ ఎంపీ నారాయణకు పరామర్శ

ప్రజాశక్తి - ముదినేపల్లి

టిడిపి కృష్ణ జిల్లా అధ్యక్షులు, మచిలీపట్నం మాజీ ఎంపీ కొనకళ్ల నారాయణ ఇటీవల గుండెపోటుకు గురై విజయవాడలోని రమేష్ హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్నారు. ఈ విషయం తెలుసుకున్న టిడిపి కైకలూరు నియోజకవర్గ కన్వీనర్ ముదినేపల్లి మండలానికి చెందిన వీరమల్లు నరసింహారావు, వారి సోదరుడు వీరమల్లు సత్యనారాయణ, మాజీ ఎంపిపి పోసిన పాండురంగారావు, కట్టా కోటేశ్వరరావు విజయవాడలో చికిత్స పొందుతున్న నారాయణను పరామర్శించారు.

గురజలో భారీ అన్నసమారాధన

ప్రజాశక్తి - ముదినేపల్లి

మండలంలోని గురజ గ్రామంలో దక్షిణ పక్కన ఉన్న దాసాంజనేయ స్వామి వారి ఆలయంలో శ్రీ సీతారామ స్వామి వారి శాంతి కళ్యాణ మహోత్సవాల సందర్భంగా ఆదివారం స్వామివారిని ఎంపిపి రామిశెట్టి సత్యనారాయణ వైసిపి నాయకులతో కలిసి దర్శించుకున్నారు. అనంతరం స్వామివారి సన్నిధిలో జరిగిన మహా అన్న సమారాధన కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సమారాధనలో పెద్ద ఎత్తున గ్రామస్తులు, పరిసర ప్రాంత ప్రజలు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండలాధ్యక్షులు మొట్రూ ఏసుబాబు, పార్టీ గ్రామ అధ్యక్షులు మరీదు వసంతరావు, యార్లగడ్డ హేమంత్, రాచూరి కుమార్, పుట్టి సుబ్బారావు, పోకల కృష్ణ, అల్లాడి సతీష్, ప్రభు, మరీదు సాయి, మరీదు ఆదిత్య, శొంఠి వినయ్, జోగి తేజ, కొల్లి నాని, నూతక్కి రమేష్, దగాని కోటేశ్వరరావు, పెయ్యేరు వైస్ సర్పంచి దివి సతీష్, పార్టీ గ్రామ నాయకులు, గౌడ కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం
సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం
సెల్: 83339 88814

సుందరయ్య ఆశయాలు ఆదర్శనీయం

పలుచోట్ల వర్ధంతి సభలు

జంగారెడ్డిగూడెంలో...

ప్రజాశక్తి - ఏలూరుటౌన్

దక్షిణ భారతదేశ కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాత, స్వాతంత్ర్య సమరయోధుడు పుచ్చలపల్లి సుందరయ్య 39వ వర్ధంతి కార్యక్రమాన్ని సిపిఎం ఆధ్వర్యంలో పెదపాడులోని నర్రా ఆంజనేయులు భవనంలో ఆదివారం నిర్వహించారు. తొలుత సుందరయ్య చిత్రపటానికి సిపిఎం కార్యకర్తలు, నాయకులు పూలమాలలు వేసి జోహార్లు అర్పించారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు కె.శ్రీనివాస్ మాట్లాడుతూ పుచ్చలపల్లి సుందరయ్య త్యాగాల స్ఫూర్తితో ప్రజాసమస్యలపై పోరాడాలని పిలుపునిచ్చారు. కష్టజీవుల సమస్యల పరిష్కారం కోసం సమ సమాజమే మార్గమని నమ్మిన కమ్యూనిస్టు సిద్ధాంతం కోసం తుది శ్వాస వరకు పని చేసిన ఆదర్శమూర్తి సుందరయ్య అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు షేక్ కరీముల్లా, కొండలరావు, రెడ్డి లక్ష్మణరావు, షేక్ షఫీరా పాల్గొన్నారు.

ఏలూరు సిటీ : విగ్రహాలు కాదు గ్రంథాలయాలను నెలకొల్పండని చెప్పిన దక్షిణ భారత కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాత, ఆదర్శ నేత పుచ్చలపల్లి సుందరయ్య 39వ వర్ధంతి సభ ఆదివారం ఏలూరు, గాంధీనగర్ సుందరయ్య గ్రంథాలయంలో గ్రంథాలయ శాఖ కార్యదర్శి కంది విశ్వనాధం అధ్యక్షతన నిర్వహించారు. సభకు ముఖ్య వక్తలుగా విచ్చేసిన సిపిఎం జిల్లా నాయకులు బుద్ద సోమయ్య, సిపిఐ జిల్లా నాయకులు బండి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ పుచ్చలపల్లి సుందరయ్య ఆశయాలను ముందుకు తీసుకెళ్తామని ఆయన స్ఫూర్తితో గ్రంథాలయాలను విజ్ఞాన కేంద్రాలను ఏర్పాటు చేసేందుకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. వర్ధంతి సభ అనంతరం మజ్జిగ చలివేంద్రాన్ని నిర్వహించారు. జె.గోపీ, మంచెల్ల ఇస్సాకు సభా కార్యక్రమానికి నాయకత్వం వహించగా సిపిఎం నగర కార్యదర్శి పి.కిషోర్, సిహెచ్.అమర్‌కుమార్, సిహెచ్.సుందరయ్య, ఇందిరా, లెనిన్, ఠాగూర్ రాజా ప్రజాసంఘాల నాయకులు హాజరయ్యారు.

టి.నరసాపురం : పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతి సందర్భంగా మండలంలోని ఎఎస్ఆర్ నగర్ గ్రామస్తులు సుందరయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పార్టీ మండల కార్యదర్శివర్గ సభ్యులు అనుమోలు మురళి మాట్లాడుతూ భారతదేశంలో కమిటీ సభ్యుల నుంచి సిపిఎం వ్యవస్థాపకునిగా విప్లవ పోరాటాన్ని సాగించిన యువకునిగా పార్లమెంటులో తొలి ప్రతిపక్ష నాయకుడిగా వ్యవహరించారని గుర్తు చేశారు. పార్టీ కోసం, ప్రజల కోసం ఆయన యావదాస్తిని అర్పించారని, సుందరయ్య ఆశయాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని, రానున్న కాలంలో కూడా అలాంటి నాయకుల ఆశయాలు ప్రజానీకానికి చాలా అవసరమని చెప్పారు. ఈ

టి.నరసాపురంలో...

కార్యక్రమంలో రొట్టె భద్రకాళి, పురం దుర్గమ్మ, తాటికొండ సుబ్బమ్మ పాల్గొన్నారు.

జంగారెడ్డిగూడెం టౌన్ : స్థానిక సిపిఎం కార్యాలయంలో పట్టణ కన్వీనర్ సూర్యారావు అధ్యక్షతన సుందరయ్య వర్ధంతి నిర్వహించారు. సుందరయ్య చిత్రపటానికి సిపిఎం నాయకులు సత్యనారాయణ, ఎ.రామచంద్రరావు పూలమాలలు నివాళులర్పించారు. ఈ సందర్భంగా సిపిఎం మండల కార్యదర్శి ఎం.జీవరత్నం మాట్లాడారు. యావదాస్తి మొత్తం పేద ప్రజలకు దానం చేసిన ఘనత సుందరయ్యకే దక్కుతుందన్నారు. సుందరయ్య ఆశయాలను ముందుకు తీసుకెళ్లాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల కమిటీ సభ్యులు బి.రాంబాబు, జి.సూర్యకిరణ్, పట్టణ కమిటీ సభ్యులు ఎస్‌కె.సుభాషిని, వి.గోపి, ఎస్‌కె మాబు, సుభాని, కె.సుబ్బారావు, బి.యశ్వంత్, జి, మణి, జిఎస్.నారాయణ, ఎం.విజయ్, బి.నాని పాల్గొన్నారు. పట్టెన్నపాలెం చింతాల చెరువు ఉపాధి హామీ పని ప్రదేశంలో వ్యవసాయ కార్మిక సంఘం మండల కమిటీ ఆధ్వర్యంలో వర్ధంతి సభ నిర్వహించారు. జె.సూర్యచంద్రరావు సుందర య్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు జీవరత్నం మాట్లాడారు. ఈ కార్యక్రమంలో అర్జునుడు, దుర్గారావు, వసంతరావు, పూసం దుర్గ, కనితి చిన్నదుర్గమ్మ, కె.మహాలక్ష్మి, టి.రాముడు, కె.సుబ్బారావు పాల్గొన్నారు.

ఆగిరిపల్లి : ఆగిరిపల్లిలోని ఎకెఎస్ భవన్(యుటిఎఫ్)లో సిపిఎం ఆధ్వర్యంలో సుందరయ్య వర్ధంతి సభ నిర్వహించారు. సుందరయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి జోహార్లు అర్పించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం ఆగిరిపల్లి మండల కార్యదర్శి సిహెచ్.శివనాగరాజు, సత్తు కోటేశ్వరరావు, జె.గోపాలరావు, ఎన్.ఊళక్కయ్య, అయ్యప్ప, స్టాలిన్, శామ్యూల్, బాలు, శ్రీను పాల్గొన్నారు.

కుక్కునూరు : సుందరయ్య జీవితం ప్రతిఒక్కరికీ ఆదర్శప్రాయమని సిపిఎం మండల కార్యదర్శి యర్రంశెట్టి నాగేంద్రరావు అన్నారు. మండలంలోని చీరవల్లి, మాధవరం, దాచారం, కుక్కునూరు గ్రామాల్లో సుందరయ్య వర్ధంతి కార్యక్రమాలను సిపిఎం ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా నాగేంద్రరావు మాట్లాడుతూ సుందరయ్య వీర తెలంగాణ సాయుధ పోరాట, రైతాంగ ఉద్యమానికి నాయకత్వం వహించిన నాయకుడిగానే కాకుండా గొప్ప పార్లమెంటిరియన్ 17 ఏళ్ల పాటుగా ఆయన ఎంఎల్ఎ ఉన్నారన్నారు. ఐదేళ్ల పాటు ఎంపీగా చేశారన్నారు. సుందరయ్య స్ఫూర్తితో ప్రజా సమస్యలపై పోరాటాలు సాగిద్దామని, అందుకు ప్రతిఒక్కరూ కలిసి రావాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కమిటీ సభ్యులు యర్నం సాయికిరణ్, మేడిపల్లి బాబు, కోట రామలక్ష్మి, పట్ల లక్ష్మయ్య, షేక్ వలిపాషా, పార్టీ సభ్యులు కోట మోహన్‌రావు,

ఆగిరిపల్లిలో...

మహబూబ్ పాషా పాల్గొన్నారు.

కలిదిండి : సిపిఎం ఆధ్వర్యంలో స్థానిక ప్రజా సంఘాల కార్యాలయంలో, మూలలంక, భాస్కరరావుపేట గ్రామాల్లో వర్ధంతి కార్యక్రమాలు నిర్వహించారు. మజ్జిగ, అల్పాహారం పంపిణీ చేశారు. సుందరయ్య నిజాయితీ, నిడారంబరత అందరికీ ఆదర్శనీయమని సిపిఎం మండల కార్యదర్శి శేషపు మహంకాళీరావు అన్నారు. సిపిఎం మండల కమిటీ సభ్యులు వీరవల్లి భాస్కరరావు, సిఐటియు మండల కార్యదర్శి జక్కుల మహేష్, కెవిపిఎస్ జిల్లా అధ్యక్షులు ముంగం సురేష్, ఐద్వా మండల కార్యదర్శి ఎస్.మహాలక్ష్మి, కార్యకర్తలు కుడిపూడి శ్రీనివాసరావు, పరసా రాజేష్, సత్యనారాయణ, బుస్సా రామనాగేంద్రం, గద్దె అనిల్ కుమార్, చల్లా టోపిల్, ఎస్.భగత్ సత్యకుమార్ పాల్గొన్నారు.

నీరు గారుతున్న 'జల జీవన్ మిషన్' లక్ష్యం

పైపులైన్ లీకేజీతో ప్రజల అవస్థలు
తాగునీరు కలుషితం
పట్టించుకోని అధికారులు

ప్రజాశక్తి - చింతలపూడి

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎంతో ప్రతిష్టాత్మకంగా 2019లో ప్రారంభించిన జల జీవన మిషన్ పథకం లక్ష్యం నీరుగారుతుంది. అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో పైపులైన్ లీక్ అయి తాగునీరు కలుషితమవుతుందని మండలంలోని కొమ్ముగూడెం గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొమ్ముగూడెం గ్రామంలో జలజీవన్ మిషన్ పథకం కింద ఇంటింటి కుళాయి బిగించారు. పైపులైన్లు వేసిన వద్ద నీరు లీక్ అవ్వడంతో గ్రామస్తులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పైపులైన్ లీక్ అవ్వడంతో నీరు కలుషితమవుతుందని వాపోతున్నారు. అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో తూతూ మంత్రంగా పనులు ముగించేశారని గ్రామస్తులు చెబుతున్నారు. చాలా గ్రామాల్లో తాగునీరు రాక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, తమ గ్రామంలో తాగునీరు ఉన్నా

పైపులైన్ లీక్ అవుతున్న ప్రదేశం

ఇలా పైపులైన్ లీక్ ద్వారా బయటకు పోతున్నాయని గ్రామస్తులు చెబుతున్నారు. నీరు కలుషిత మైతే ప్రజలు అనారోగ్యానికి గురయ్యే ప్రమాదం ఉందని, ఉన్నతాధికారులు దీనిపై దృష్టి పెట్టి సమస్యను వెంటనే పరిష్కరించాలని గ్రామస్తులు కోరుతున్నారు. పైపులైన్లు లీక్ అవుతున్నాయని మండల పరిషత్ సర్వసభ్య సమావేశంలో పలు మార్లు గ్రామస్తులు ప్రస్తావించినా నేటికీ సమస్య పరిష్కరించలేదని అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పైపులైన్లు లీక్ కాకుండా చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

అధికారులు చర్యలు తీసుకోవాలి
రవి, కొమ్ముగూడెం

జలజీవన్ పథకం కింద పైపులైన్లు వేసి కుళాయిలు బిగించారు. కాని పైపులైన్ వేసిన ప్రదేశం వద్ద పైపులైన్ లీక్ అవ్వటంతో ఇబ్బందులకు గురవుతున్నాము. అధికారులు స్పందించి పైపులైన్ లీక్ అవ్వకుండా జాగ్రత్తలు తీసుకోవాలి.

తాగునీరు కలుషితం
పవన్‌సాయి, కొమ్ముగూడెం

పైపులైన్ లీక్ అవడంతో తాగునీరు కలుషితమవుతుందని భయంగా ఉంది. అధికారులు స్పందించి పైపులైను లీక్ అవ్వకుండా చర్యలు తీసుకోవాలి.

పరిష్కారానికి చర్యలు తీసుకుంటాం
ఆర్‌డబ్ల్యూఎస్ ఎఇ, ఫణికుమార్

కొమ్ముగూడెంలో పైపులైన్ లీకేజీ సమస్యను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటాం.

'మానవత' ఆధ్వర్యాన పలు సేవా కార్యక్రమాలు

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

మానవత ఏలూరు యూనిట్ నెలవారీ సమీక్షా సమావేశాన్ని స్థానిక ఆర్ఆర్.పేట లేడీస్ రిక్రియేషన్ క్లబ్‌లో మానవత అధ్యక్షులు మేతర అజయ్‌బాబు అధ్యక్షతన ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా పలు సేవా కార్యక్రమాలను నిర్వహించారు. సిఆర్ఆర్ పాలిటెక్నిక్ కళాశాలలో చదువుతున్న ఆర్థికంగా వెనుకబడిన విద్యార్థి మైనేని సాయి సిద్ధార్థ్‌కు రూ.15,450 ఆర్థిక సాయాన్ని, గుండె జబ్బుకు చికిత్సను పొందుతున్న కె.భాస్కరరావుకు రూ.ఐదు వేలు సాయంగా అందించారు. పదో తరగతి పరీక్షల్లో రాష్ట్రంలో 599 మార్కులతో మొదటి స్థానం సాధించిన ఆకుల వెంకట నాగసాయి మనస్వికి, 570 పైన మార్కులు సాధించిన 15 మంది విద్యార్థులకు ఆర్థిక పురస్కారాలను, ప్రశంసాపత్రాలను, జ్ఞాపికలను అందించారు. ఖరగ్ పూర్ ఐఐటిలో మొదటి సంవత్సరం బీటెక్ చదువుతున్న మెరిట్ విద్యార్థి జి.ప్రభాష్‌ను సత్కరించారు. చాటపర్రు రోడ్డులో ఉన్న అంధుల పాఠశాలకు విరాళంగా మానవత జిల్లా విద్యానిధి ఛైర్మన్ ఆలపాటి నాగేశ్వరరావు రూ.50 వేలు, మానవత ఏలూరు యూనిట్ కోశాధికారి అల్లూరి మోహిని రూ.పది వేలు పాఠశాల నిర్వాహకుడు పేరకం చంద్రశేఖర్‌కు అందించారు. ఏలూరు రీజియన్ ఛైర్మన్ పోలవరపు దేవరత్నాకరరావు, మండల ఛైర్ పర్సన్ అడుసుమిల్లి నిర్మలకు మొదటి రశీదు పుస్తకాన్ని అందించి 2024-2025 మానవత ఏలూరు యూనిట్ సభ్యత్వాల నమోదును ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పిల్లల వైద్యులు జిఎస్.ప్రసాద్, మానవత గౌరవ డైరెక్టర్ మునగాల మురళీకృష్ణ, డైరెక్టర్ దేవినేని భాస్కరరావు, ఉపా ధ్యక్షురాలు మానేపల్లి హేమసునీత పాల్గొన్నారు. అనంతరం యోగా గురువు డాక్టర్ కమ్ముల ఆదినారాయణను సత్కరించారు.

మామిడి రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి

ఎపి రైతు సంఘం

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

తెగులు వల్ల దిగుబడి లేక నష్టపోయిన మామిడి రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు నిమ్మగడ్డ నరసింహ, కె.శ్రీనివాస్ ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. నూజివీడు, చింతలపూడి ప్రాంతాల్లో వేలాది ఎకరాల్లో మామిడి తోటలు ఉన్నాయని, మామిడి పంట మీదే ఆశలు పెట్టుకుని రైతులు సాగు చేస్తున్నారని చెప్పారు. ప్రతి ఏటా నష్టాలతో మామిడి రైతులు డీలాపడిపోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సంవత్సరం తెగుళ్ల ఆశించి దిగుబడులు బాగా తగ్గిపోయాయని, మరోవైపు గాలి వానల ఫలితంగా ఉన్న పంట కాస్త రాలిపోయి నష్టపోయారని చెప్పారు. దిగుబడి ఉంటే ధర లేక ధర ఉంటే దిగుబడి లేక మామిడి రైతులు నష్టాలనే చవిచూస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దేశంలో ఇతర రాష్ట్రాలకు, ఇతర దేశాలకు ఇక్కడ నుంచి మామిడి ఎగుమతులు అవుతున్నాయని చెప్పారు. తెగుళ్ల నివారణకు ఉద్యాన శాఖ దృష్టి సారించాలని కోరారు. మామిడి రైతులకు లాభసాటి ధర వచ్చేలా ప్రభుత్వం తగిన శ్రద్ధ పెట్టాలని కోరారు. లేకపోతే ఉన్న మామిడి తోటలు కూడా రైతులు తొలగించి వేస్తే మామిడి పంట అంతరించిపోతుందన్నారు. మామిడి పంటను, మామిడి రైతులను రక్షించాలని కోరారు.

బాధితునికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి - పోలవరం

ఏజెన్సీ గ్రామాల్లో కూడా మానవత స్వచ్ఛంద సేవా సంస్థ అనారోగ్యంతో ఉన్నవారికి ఆర్థిక సాయం అందిస్తుందని ఆ సంస్థ పోలవరం మండలాధ్యక్షులు గణేష్ మాస్టర్ అన్నారు. పోలవరంలోని రిటైర్డ్ ఉద్యోగుల విశ్రాంతి భవనం వద్ద పోలవరం మండలం కోయనాగంపాలెం గ్రామానికి చెందిన సవలం కన్నపు రాజు కిడ్నీ వ్యాధితో బాధపడుతున్నారు. ఈ విషయం తెలుసుకున్న మానవత సంస్థ వారు రూ.ఐదు వేలు ఆర్థిక సాయం అందించారు. ఈ సందర్భంగా గణేష్ మాస్టర్ మాట్లాడుతూ పోలవరం మండలంలో ఎవరైనా ఆర్థికంగా ఇబ్బంది పడి చదువులకు గాని, వైద్య సదుపాయాలకు గాని ఇబ్బందులు పడితే తమ సంస్థకు తెలియపరచాలన్నారు. మానవతా స్వచ్ఛంద సేవ సంస్థలో పేరు నమోదు చేసుకోవాలంటే రూ.600 సభ్యత్వం కట్టి జాయిన్ అవ్వొచ్చని తెలిపారు. ఇప్పటికే చాలామంది పోలవరం మండలంలో పేర్లు నమోదు చేసుకున్నారని, మరి కొంతమంది జాయిన్ అయితే చాలామంది లేని వారికి ఉపయోగపడవచ్చన్నారు. మానవత స్వచ్ఛంద సంస్థకు ఎవరైనా దాతలు గృహం కట్టుకోవడానికి, ఫ్రీజర్ బాక్స్ పెట్టుకోవడానికి కొద్దిపాటి స్థలం ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షులు పోసుబాబు, రివిజినల్ మేనేజర్ వాసుబోయిన చంద్రయ్య, కొమ్మిశెట్టి వెంకటేశ్వరరావు, సిద్దా కృష్ణమూర్తి, ఆకుల నరసింహమూర్తి, పోతుల చిరంజీవి, తెలగం శెట్టి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

అకాల వర్షం.. అన్నదాతకు నష్టం

ధాన్యం తడవడంతో రైతుల్లో ఆందోళన
ప్రభుత్వం ఆదుకోవాలని వేడుకోలు

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం టౌన్

వర్షం కారణంగా తాము నష్టపోతున్నామని జంగారెడ్డిగూడెం మండల పరిధిలోని చుట్టుపక్కల గ్రామ రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల కురిసిన అకాల వర్షాలకు ధాన్యం పూర్తిగా తడవడంతో రైతులు వాపోతున్నారు. అయినా అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని, తడిసిన ధాన్యం కొనుగోలు చేసేందుకు అధికారులు ఎటువంటి చర్యలు తీసుకోవడంలేదని ఆవేదన చెందుతున్నారు. వరి, మొక్కజొన్న, ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో కొనుగోలు జరగడం లేదని, దీనిపై సంబంధిత సొసైటీ డైరెక్టర్లు, ఛైర్మన్లు నిర్లక్ష్యం వహిస్తున్నారని రైతులు వాపోతున్నారు. తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందని ప్రభుత్వం ప్రకటించినా అధికారులు మాత్రం కనికరించడం లేదంటున్నారు. గోనెసంచుల కోసం సొసైటీల దగ్గర ఉదయం నుంచి సాయంత్రం వరకు పడిగాపులు కాయాల్సి వస్తుందని ఆవేదన చెందుతున్నారు. ఈ అకాల వర్షాల కారణంగా వరి మళ్లల్లో నీరు చేరడంతో పంటను బయటకు తీసుకొచ్చేందుకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని, కనీసం వరి పొలాల్లో పని చేయడానికి కూలీలు కూడా పనికి రావడం లేదని వాపోతున్నారు. పండిన పంటను జాగ్రత్త చేసుకోవడానికి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామంటున్నారు. తడిసిన ధాన్యాన్ని సైతం రోడ్లపైకి మూటలు కట్టి తీసుకొచ్చి రోడ్లపై నిద్రిస్తూ తడిచిన ధాన్యాన్ని ఆరబెట్టుకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. పండించిన పంటకు కనీసం మద్దతు ధర


రోడ్డు పక్కన ధాన్యం ఆరబెడుతున్న రైతులు

కల్పించడంలో ప్రభుత్వం చర్యలు తీసుకోవడంలేదని విమర్శిస్తున్నారు. తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేస్తామని హామీ ఇచ్చిన ప్రభుత్వం తీర రైతన్నకు కన్నీటిని మిగులుస్తుందన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం, అధికారులు తమ బాధను అర్థం చేసుకుని పండించిన పంటకు గిట్టుబాటు ధర కల్పించి అకాల వర్షాల వల్ల తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వమే కొనుగోలు చేసి రైతన్నకు మేలు జరిగే విధంగా చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

బిఎస్ఎన్ఎల్ టవర్ నిర్మాణానికి శంకుస్థాపన

ప్రజాశక్తి - టి.నరసాపురం

మండలంలోని మర్రిగూడెం గ్రామంలో రూ.1.40 కోట్లతో నిర్మించనున్న బిఎస్ఎన్ఎల్ సెల్ టవర్ నిర్మాణానికి అధికారులు ఆదివారం శంకుస్థాపన చేసి పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా వైసిపి ఎస్‌టి సెల్ రాష్ట్ర అధ్యక్షుడు కురసం నిరీక్షనరావు మాట్లాడుతూ ఏలూరు ఎంపీ కోటగిరి శ్రీధర్, పోలవరం ఎంఎల్ఎ తెల్లం బాలరాజు సహకారంతో సెల్ టవర్ మంజూరైందన్నారు. గిరిజన ప్రాంత ప్రజల చిరకాల కోరిక సెల్ టవర్ నిర్మాణం అన్నారు. సెల్ టవర్ సౌకర్యాలు లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తోందన్నారు. టవర్ ఏర్పాటుకు అధికారులు చర్యలు చేపట్టడంతో ప్రాంతంలో గిరిజనులు సంతోషం వ్యక్తం చేస్తున్నారన్నారు. ఎంపీ, ఎంఎల్ఎలకు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచి సోయం బిందు, వైసిపి ఎస్‌టి సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నిరీక్షణరావు, ఎస్‌టి సెల్ మండలాధ్యక్షులు కురసం రవీంద్రబాబు, యూత్ నాయకులు పూసం సూర్యచంద్రరావు పాల్గొన్నారు.

బాటిళ్లలో పెట్రోల్, డీజిల్ పోయొద్దు : ఎస్ఐ

ప్రజాశక్తి - ముదినేపల్లి

మండలంలోని పెట్రోల్ బంకుల్లో బాటిళ్లలో పెట్రోల్, డీజిల్ పోయవద్దని ఎస్ఐ డి.వెంకట్‌కుమార్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఓట్ల లెక్కింపు పూర్తయ్యే వరకు వాహనాల్లో మాత్రమే ఇంధనం నింపాలని స్పష్టం చేశారు. ఈ నిబంధనలు ఉల్లంఘిస్తే ఆయిల్ బంకుల లైసెన్స్ రద్దు చేస్తామని ఎస్ఐ హెచ్చరించారు. ఈ మేరకు మండలంలోని అన్ని బంకుల యజమానులకు నోటీసులు పంపినట్లు ఆయన తెలిపారు. పోలింగ్ తర్వాత రాష్ట్రంలో పలుచోట్ల హింసాత్మక ఘర్షణల జరిగిన నేపథ్యంలో ఎలక్షన్ కమిషన్ ఆదేశాల మేరకు ఈ ఆంక్షలు విధించినట్లు ఎస్ఐ తెలిపారు.

'మానవత' మండలాధ్యక్షునిగా బాబ్జి

ప్రజాశక్తి - భీమడోలు

స్వచ్ఛంద సంస్థ భీమడోలు మానవత శాఖ నూతన అధ్యక్షులుగా గుడివాడ సీతారామాంజనేయులు (బాబ్జి) ఎన్నికయ్యారు. భీమడోలు మానవతా కార్యాలయ భవనంలో ఆదివారం శాఖ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మానవత జిల్లా శాంతి రథాల విభాగం ఛైర్మన్ అప్పక రాంబాబు, సమన్వయకర్త రామిశెట్టి గంగాధరరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సమావేశంలో ప్రస్తుత ఆర్థిక సంవత్సరం కనీసంగా వెయ్యి మందికి తక్కువ కాకుండా సభ్యులను చేర్చుకోవాలని నిర్ణయించారు. అనారోగ్యంతో ఇబ్బంది పడుతున్న భీమడోలుకు చెందిన ఒక కుటుంబ యజమానికి రూ.ఐదు వేల ఆర్థిక సాయం అందించారు. అనంతరం 2024- 25 ఆర్థిక సంవత్సరానికి నూతన కార్యవర్గ ఎన్నికలను నిర్వహించారు. ఏకగ్రీవంగా జరిగిన ఎన్నికల్లో అధ్యక్షులుగా గుడివాడ సీతారామాంజనేయతో పాటు కార్యదర్శిగా ఎ.ప్రసాద్ ఎంపికయ్యారు. ఈ కార్యక్రమంలో శాఖ ఛైర్మన్ గుళ్ల నూకరాజు, తుమ్మల వెంకట ఉమామహేశ్వరరావు, జి.రమణశంకర్, పి.సత్యనారాయణ పాల్గొన్నారు.

నేడు, రేపు విద్యుత్ సరఫరా నిలిపివేత

ప్రజాశక్తి - టి.నరసాపురం

ఈ నెల 20, 21 తేదీల్లో ఉదయం ఎనిమిది గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పనుల కారణంగా విద్యుత్ సరఫరాలో అంతరాయానికి వినియోగదారులు సహకరించాలని జంగారెడ్డిగూడెం డివిజనల్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ పి.రాధాకృష్ణ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని రాజుపోతేపల్లిలో ఉన్న 33/11కెవి సబ్ స్టేషన్ పరిధిలోని కొత్త గూడెం 11 కెవి ఫీడర్ ఆర్‌డిఎస్ఎస్ మరమ్మతులు చేస్తున్నందున విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని, వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

22 నుంచి సోమేశ్వర స్వామి కళ్యాణోత్సవాలు

ప్రజాశక్తి - ముదినేపల్లి

మండలంలోని అల్లూరు గ్రామంలో ఉన్న పార్వతీ సమేత సోమేశ్వర స్వామి ఆలయంలో స్వామివారి కల్యాణోత్సవాలు ఈ నెల 22వ తేదీ నుంచి ప్రారంభం కానున్నట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి ఎస్.శ్రీనివాసరావు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. మూడు రోజులు పాటు జరిగే ఉత్సవాల్లో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ నెల 22న స్వామి, అమ్మవారిని పెండ్లి కుమారుడు, పెండ్లి కుమార్తెను చేయడం, 23న కళ్యాణం, 24న స్వామి వారి ఊరేగింపు, పవళింపు సేవ జరుగుతాయన్నారు. సుమారు 300 ఏళ్లకు పైగా చరిత్ర కలిగిన ఈ దేవస్థానంలో ఏడాదికి ఒకసారి జరిగే కల్యాణోత్సవాలకు మండలంలోని పలు గ్రామాల నుంచి భారీగా భక్తులు తరలివస్తారని చెప్పారు.

పాస్‌పోర్టు పోయినది
CHINTA SUBBA LAKSHMI అను నాకు విశాఖపట్నం పాస్‌పోర్టు కార్యాలయం అధికారులు ది.22-05-2019న T0937892 నెంబరు గల పాస్‌పోర్టు మంజూరు చేసారు. సదరు పాస్‌పోర్టు జిరాక్స్ కాపీలు తీయించుకునేందుకు ది.06-05-2024న మా ఇంటి నుండి నరసాపురం పట్టణం మెయిన్‌రోడ్‌కు వెళ్తున్నపుడు నా ఒరిజినల్ పాస్‌పోర్టు పోయినది. గాన నా పాస్‌పోర్టు ఎవరికైనా దొరికిన యెడల ఈ క్రింది చిరునామాకు అందించగలరని కోరుతున్నాను.
CHINTA SUBBA LAKSHMI
W/o. Chinta Durga Prasad
D.No. 3-4-11, Near Raithu Bazar,
Jampavari Street, Narasapuram-534275 Dt., A.P.